# గండి గండికో నిర్లక్ష్యపు గాథ

**1996 జూన్, అక్టోబర్ నెలల్లో చిత్తూరు, కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాలలో వందలాది చెరువుల కట్టలు తెంచి గ్రామాలను అల్లకల్లోలం చేసిన విచిత్రమైన వరదలను రాష్ట్రం మరచిపోయి ఉండవచ్చును గానీ ఆ ప్రాంత ప్రజలు మరచిపోలేదు.**

వీటిని 'విచిత్రమైన వరదలు' అని ఎందుకంటున్నామంటే వీటివల్ల దెబ్బతిన్న ప్రాంతం మామూలుగా కరువు ప్రాంతం. అక్కడ పొంగడానికీ ఊర్లు ముంచడానికీ పెద్దనదులేవీ లేవు. కోనసీమలాగ తుఫాను దెబ్బ తగలడానికి సముద్రం దగ్గరలో లేదు. అది ప్రధానంగా చెరువులపైన ఆధారపడి వ్యవసాయం చేసుకుచే ప్రాంతం. ఏ సంవత్సరమైనా వర్షాలు చెరువుల నిండా కురిస్తే సంతృప్తి చెందే ప్రాంతం. గత సంవత్సరం ఆ చెరువులే తెగి బీభత్సం సృష్టించాయి. పుండు మీద కారంలాగ, మన రైతులకు నీళ్లియ్యకుండా మద్రాసుకు మంచి నీళ్లు తీసుకుపోవడానికి తయారయి కడప, నెల్లూరు రైతుల కడుపు మండించివ తెలుగు గంగ కాలవ గట్టు కూడా పలు చోట్ల తెగింది. అదికూడా పొలాలను ముంచింది. ఆ ప్రాంతం వాళ్లు నిరుటి వరదలను ఇప్పటికీ మరిచి పోకపోవడానికి చాలా కారణాలున్నాయి. వరదలలో కొట్టుకొనిపోయిన వారి కుటుంబాలు తాము పోగొట్టుకున్న ఆప్తులను అప్పుడే మరిచి పోలేరు. పంట పోగొట్టుకున్న రైతులు ఆర్థికంగా ఇప్పటికీ కోలుకోలేదు కాబట్టి ఆ దెబ్బను అంత సులభంగా మరచిపోలేరు. ఇసుక మేట వేసిన వందలాది ఎకరాల భూమిని రైతులు (అతి కొద్ది మినహాయింపులతో) ఇప్పటికింకా బాగు చేసుకోలేదు. ఆ భారం వాళ్లను మరచిపోనివ్వదు. కానీ అన్నిటి కంటే ముఖ్యమైన కారణం, గండ్లుపడి బోసిపోయిన చెరువు కట్టలు ఆనాటి బీభత్సానికి గుర్తుగా ఈనాటికీ మరమ్మత్తులకు నోచుకోకుండా అట్లాగే ఉండడం. ఆ దృశ్యాన్ని నిత్యం చూస్తూ, మళ్ళీ వర్షం వస్తే తమ గతి ఏమవుతుందో అని భయపడే రైతులు నిరుటి ఉపద్రవాన్ని ఎట్లా మరిచి పోగలరు?

ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితులు ఉండడాన్ని చూసి వాళ్లకు ఏడవాలో నవ్వాలో తెలియడం లేదు. అది మామూలుగా కరువు ప్రాంతం కాబట్టి వర్షాలు తగినంత కురిసి భూమి లోపలా పైనా నీళ్లు నిలిస్తేనే వాళ్ల బ్రతుకు గడుస్తుంది. కానీ కురిసిన నీటిని నిలపవలసిన చెరువులు కట్టలు తెగి బోసిపోయి ఉన్నాయి. కాబట్టి వాన బాగా కురిస్తే మళ్లీ వరదలు రావడం తథ్యం. ఆ ప్రమాదం నుండి వర్షాభావం వాళ్లను కాపాడినట్టే!

ఆ వరదలకు కారణం ఒకరకమైన నిర్లక్ష్యమైతే ఇప్పుడు ఇంకొక రకం నిర్లక్ష్యంతోడయి ప్రజల జీవితాలను దుర్భరం చేస్తున్నది. వర్షం పడక పోతే బ్రతకడానికి అవసరమైన నీళ్లు దొరకవు. వర్షం సగటు మోతాదులో పడినా చెరువులకు మన పాలకులు చేసిన తాత్కాలిక మరమ్మతులు తట్టుకోలేవు. మళ్లీ చేలూ, ఊర్లూ మునిగిపోతాయి. అంతా అయినాక మళ్లీ చెరువులలో నీళ్లుండవు. '1999 వరకు ఇదే సరిస్థితి' (అంటే గత సంవత్సరం కట్టలు తెగిన చెరువులకు పూర్తి మరమ్మతులు జరగవు) అని ప్రకాశం జిల్లా రాళ్లపాడు రిజర్వాయిర్ మరమ్మతులు పర్యవేక్షిస్తున్న ఇంజనీరొకరు ('నా పేరు రాయొద్దు' అంటూ) అడిగిన వాళ్లకు నిజాయితీగా జవాబు చెప్తున్నాడు.

వరదలకు కారణమైన నిర్లక్ష్యాలన్నిటినీ (నిర్లక్ష్యాలు అని బహువచనంలో అనక తప్పదు) ఒక సారి జ్ఞాపకం చేసుకుందాం. ఈ వరదలు వచ్చిన ప్రాంతం అమలాపురం లాగ సముద్ర తీరానికి దగ్గరలో లేదు – అకస్మాత్తుగా ఉప్పెన వస్తే సకాలంలో ప్రజలను హెచ్చరించడం తప్ప ప్రభుత్వం చేయగలిగింది ఏముంది అని అడగడానికి. నిజానికి ఈ వరదలకు కారణం ఉప్పెన వంటి హఠాత్ పరిణామం కాదు. ఎడ తెరిపి లేకుండా కురిసిన వర్షం ఈ వరదలకు దారి తీసిన మాట వాస్తవమే. కానీ అదే వరదలకు కారణం కాదు.

చిత్తూరు జిల్లా మదనపల్లి పట్టణంలో జూన్ నెలలో 27 ప్రాణాలు తీసిన వరదల గురించి తరువాత చెప్పుకుందాం. అక్టోబర్ నెలలో పెద్ద ఎత్తున నష్టం చేకూర్చినది కడప, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు కలుసుకునే చోట ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం, ఆ వర్షపునీటి ప్రవాహాన్ని నిలప లేక పోయిన ప్రభుత్వ నీటిపారుదల వ్యవస్థల నిర్వహణ, ప్రకృతి వవరుల సంరక్షణలోని లోపం. వర్షం భారీగా కురిపిన ప్రాంతం కలసపాడు, పోరుమామిళ్ల (కడపజిల్లా), కొమురవోలు, పామూరు (ప్రకాశం జిల్లా), ఉదయగిరి (నెల్లూరు జిల్లా) మండలాలు. ఇది బీడు భూములు, రాళ్ల గుట్టలు, ఎండిపోయిన చిట్టడవులతో నిండిన ప్రాంతం. ఇటువంటి ప్రాంతంలో ఉన్న కొద్దిపాటి పచ్చదవం కోసం పశువులూ, మనుషులూ పోటీ పడతారు. ఎప్పటికప్పుడు హరిత రక్షణ చర్యలు చేపట్టక పోతే, ఈ అవసరాలు తీరకపోగా ఏ కొంచెం అతివృష్టి కురిసినా వరద ప్రవాహానికి ప్రకృతి వేయగల అడ్డుకట్ట కొరవడుతుంది. నెమ్మదిగా ప్రవహించి నేలలోకి ఇంకి భూగర్భ జలాశయంలో కలవవలసిన నీరు ఏ ఆటంకం లేకపోవటం వల్ల వేగంగా వరద అయి పారుతుంది. బీడయి పోయిన కొండ చరియల పైన, బీడు భూములలోను కురిసే వర్షం ప్రవాహమై మట్టినీ రాళ్లనూ మోసుకొని దిగువ ప్రాంతాలలోకి వేగంగా ప్రవహిస్తుంది. పొలాలలో ఇసుక మేట వేస్తుంది. చెరువులలో పూడిక పెరుగు తుంది. వేగానికి

కురిసిన నీటిని నిలపవలసిన చెరువులు కట్టలు తెగి బోసిపోయి ఉన్నాయి. కాబట్టి వాన బాగా కురిస్తే మళ్లీ వరదలు రావడం తథ్యం. ఆ ప్రమాదం నుండి వర్షాభావం వాళ్లను కాపాడినట్టే!

తట్టుకోలేక పోతే చెరువుకట్టలకు గండి పడుతుంది. పొలాలూ, ఊర్లూ మునుగుతాయి.

గత సంవత్సరం అక్టోబర్ నెలలో రెండు దఫాలు విపరీతంగా వర్షం కురిసిన ఆ అయిదు మండలాలు కలిసే ప్రాంతాన్ని పరిశీలిస్తే ఆ వర్షం అంత ప్రమాదకరమైన వరదగా ఎందుకు మారిందో అర్థం అవుతుంది. అక్కడ కొండలు ఎప్పుడో బోడి అయిపోయాయి. బీళ్లు పచ్చదనం కోల్పోయి గులకరాళ్ల బంజర్లయ్యాయి. ఆ ప్రాంతంలో అడవుల పెంపకం కోసం, పచ్చదనాన్ని కాపాడడం కోసం ప్రభుత్వం చేసింది గానీ ప్రజలను చేయుమని ప్రోత్సహించిందిగానీ శూన్యం. దీనికి ఒకే ఒక్క మినహాయింపు కడప జిల్లా కలసపాడు మండలం రాజుపాలెం గ్రామంలోని వనసంరక్షణ సమితి. అటవీశాఖ ఆ గ్రామరైతులతో కలిసి ఆ ఊరి పక్కన వున్న కొండ చరియలపైన వృక్ష సంపదను పెంపొందించడానికి చేసిన ప్రయత్నం కొంత సత్ఫలితాన్ని ఇచ్చింది. ఆ ప్రాంత మంతా ఈ మాత్రం ప్రయత్నం చేసి ఉంటే వరద తాకిడి పావు వంతయినా తగ్గి ఉండేదేమో.

అదేమీ లేకపోవడం వల్ల ఆ వరదనీరు శరవేగంగా కడపజిల్లా బద్వేలు తాలూకా వైపు, ప్రకాశం జిల్లా కందుకూరు తాలూకా వైపు ప్రవహించింది. అడ్డమొచ్చిన చెరువు కట్టలన్నీ తెంచుకుంటూ అటువైపు (కడపజిల్లాలో) సగిలేరునూ దానినుండి పెన్నను ఆపైన నెల్లూరు జిల్లాలో కండలేరు, పంబలేరులనూ ఇటువైపు (ప్రకాశం జిల్లాలో) మన్నేరునూ నింపింది. మామూలు సంవత్సరాలలో దిక్కుమాలిన ఇసుక తిన్నెలుగా కనిపించే ఈ వాగులన్నీ ఆ రాత్రి బ్రహ్మపుత్రలయ్యాయి. ఎవ్వరూ పేరు విని ఎరుగని మనేరు ఒక నెలలో రెండు సార్లు ఉలవపాడు దగ్గర మద్రాసు కలకత్తా జాతీయ రహదారిని తెగగొట్టి రైలు మార్గాన్ని ఉయ్యాలగా మార్చి వేలాది ప్రయాణీకులను ఇక్కట్ల పాలు చేసి జాతీయ ఖ్యాతి గాంచింది. ఆ ప్రాంతమంతా వర్షం పడుతూనే వుంది కాబట్టి ఈ ప్రవాహానికి ఇతర ప్రవాహాలు కూడ తోడయ్యాయి.

అక్టోబర్ 1వ తేదీన కురిసిన వర్షాల ప్రభావానికి కలసపాడు మండలం రామాపురం వద్ద సగిలేరు వాగుపైన ఉన్న ఎగువ సగిలేరు ప్రాజెక్ట్ కట్ట తెగింది. సగిలేరులో ప్రవాహం పెరిగింది. అక్టోబర్ 18-19 రాత్రి వచ్చిన వరద వల్ల అదే ప్రాజెక్టు అలుగు (మత్తడి) తెగింది. ఆ వరద కూడ చుట్టు తిరిగి మళ్లీ సగిలేరులోకి ప్రవహించింది. ఎగువ సగిలేరు ప్రాజెక్టు కాలవ పోరుమామిళ్ల ప్రాంతంలోని చెరువులను నింపుతుంది. దానిని పోరుమామిళ్ల సప్లై చానెల్ అంటారు. ఎప్పుడో పూడిపోయిన ఆ కాలవ కట్ట ఈ ప్రవాహాన్ని భరించలేక 11 చోట్ల తెగింది. కాలవ ద్వారా ఒక పద్ధతి

## సంధు ఆత్మహత్య ఎవరి తప్పు?

◄ 2

నిర్మూలించారు, దొంగతనాల్లో ఏ మేరకు రికవరీ జరిగింది అనే గణాంకాల ఆధారంగా నిర్ణయిస్తున్నారు. సొమ్ము రికవరీ, అరెస్టులు, ఎన్‌కౌంటర్లు ఎంత ఎక్కువైతే పోలీసులు అంత సమర్థులన్న మాట. ఈ రకమైన చర్చ ప్రజాస్వామ్య దేశాల్లో పోలీసులు పాటించవలసిన నియమాలను పరిగణనలోనికి తీసుకోదు.

పోలీసులు ఆస్తికి, ప్రాణానికి, స్వేచ్ఛకు రక్షణ కల్పించటానికి వున్నారు. కాదనలేం. కానీ పోలీసుల పద్ధతులు ఒక ప్రజాస్వామిక సమాజంలో శాంతి-భద్రతల అవసరాన్నిబట్టి కాక ప్రజాస్వామిక విలువలను బట్టి నిర్ణయమవుతుంది. ప్రజాస్వామిక సమాజంలో ప్రాణనష్టం జరగకుండా, వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలుగకుండా పోలీసులు వ్యవహరించాలి. అంటే అరెస్టయిన వ్యక్తిని కొట్టగూడదు. ముద్దాయికి లాయరును సంప్రదించుకొనే అవకాశం కల్పించాలి. అరెస్టయిన *24* గంటల్లో కోర్టులో హాజరు పర్చాలి. ప్రజాస్వామిక దేశంలో పోలీసులు ఈ సూత్రాలకు లోబడి వ్యవహరించాలి. ఈ సూత్రాలను ఉల్లంఘించిన వారిని శిక్షిస్తేనే ప్రజాస్వామిక విలువలకు, వ్యవస్థలకు రక్షణ ఏర్పడుతుంది.

పోలీసులు ఏం చేసినా ఫర్వాలేదు, శాంతి-భద్రతలను కాపాడితే చాలుననడం ప్రజాస్వామిక విలువలకు వ్యతిరేకం. పోలీసులు ఒక దొంగను పట్టుకోలేకపోయినా ఫర్వాలేదు అమాయకుణ్ణి మాత్రం శిక్షించకూడదని ప్రజాస్వామికవాదులంటారు. ఎందుకంటే పోలీసులు చట్టానికి లోబడి వ్యవహరించినప్పుడే ప్రజలకు రక్షణ వుంటుంది. అందుకే చట్టాన్ని ఉల్లంఘించిన పోలీసులను శిక్షించాలి. తత్ఫలితంగా ప్రజాస్వామిక వ్యవస్థ రక్షించబడుతుంది.

మనదేశంలో మిలిటెంట్ ఉద్యమాలను శాంతి-భద్రతల సమస్యగా చూడటం వలన ఈ సమస్య మరీ సంక్లిష్టంగా మారింది. ఆత్మగౌరవంతో బతకాలన్న ఆరాటంతో వివిధ ఉద్యమాల్లోకి వస్తున్న ప్రజల సమస్యలను పరిష్కరించి ప్రజాస్వామిక పద్ధతులను పెంపొందించి గౌరవప్రదంగా బతికే అవకాశాలను కల్పించే బదులు, పోలీసు బలగాలను దించడం వలన మిలిటెంట్ల జాబితాలోకి చేరేవారి సంఖ్య పెరిగిందే కాని తగ్గలేదు. పోలీసుల నిరంకుశ ప్రవర్తన వలన ప్రజాస్వామిక పద్ధతులు నాశనమయ్యాయి. అందుకే నేరాలు చేసిన పోలీసులను శిక్షిస్తే కానీ ఉద్యమాలకు రాజకీయ పరిష్కారాన్ని వెతికే ప్రక్రియ ప్రారంభం కాదు.

పోలీసులు చేసిన పాపం కొంత రాజకీయ నాయకులు మోయాలంటే తప్పులేదు కానీ అప్పటిదాకా పోలీసులు చేసిన చర్యల గురించి పట్టించుకోకూడదనడం చట్టబద్ధ పాలనకే నష్టకరం. ఎందుకంటే తప్పుచేసిన వాళ్లను శిక్షించడం ద్వారానే ప్రజాస్వామిక పద్ధతులు బలపడతాయి. సంధు ఆత్మహత్యపై ఇంత గగ్గోలు పెడుతున్నవాళ్లకు, పోలీసుల తప్పులను తవ్వితీసిన జస్వంత్ సింగ్ ఖల్రా అనే పౌరహక్కుల కార్యకర్త మాయమైపోయారన్న విషయం గురించి ఏమాత్రం పట్టింపు లేదు. ఆయన గురించి ఒక్క సానుభూతి వాక్యం కూడా లేదు. ఒక తెలుగు దినపత్రిక ఎడిటోరియల్లో రాసినట్టు "మిలిటెన్సీ కాలపు 'మైండ్‌సెట్' పంజాబ్ పోలీసులకు శాంతిస్థాపన తర్వాత కూడా పోలేదు". ●

ప్రకారం చెరువులలోకి పోవలసిన నీరు అడ్డదిడ్డంగా దమ్మనపల్లి దగ్గరున్న పోరుమామిళ్ల చెరువులోకి ప్రవహించి ఆ చెరువు కట్టను పునాదినుండి పెకలించి వేసింది. 3800 ఎకరాల ఆయకట్టు ఉన్న ఆ చెరువు ఖాళీ అయిపోయి నీళ్లన్నీ మళ్లీ సగిలేరులోనే కలిసాయి. దారిలో అడ్డమొచ్చిన చేలనూ, ఊళ్లనూ ముంచాయి. ఈ విధంగా పోటెత్తిన సగిలేరులో ప్రవాహ వేగం విపరీతమయిపోయి అదే రాత్రి దిగువ సగిలేరు ప్రాజెక్టు ఆనకట్ట తెగింది. సకాలంలో గేట్లు తెరిచినప్పటికీ ప్రవాహ వేగానికి కట్టతట్టుకోలేక పోయింది. రాక్షస హస్తాలతో పెకిలించి వేసినట్టు పెద్ద గండి పడింది. 50 ఇళ్లు నేలమట్టమయ్యాయి. 11 వేల ఎకరాల ఆయకట్టు ఉన్న ఆ ప్రాజెక్టు రిజర్వాయర్ ఖాళీ అయిపోయింది. చెప్పుకో దగ్గ విషయం ఏమిటంటే పోరుమామిళ్ల చెరువుకయినా దిగువ సగిలేరు ప్రాజెక్టుకయినా ప్రభుత్వం రిపేర్ పేరిట చేసింది చిన్న రింగ్ బండ్ వేయడం మాత్రమే. అది ఈసారి వరద వస్తే ఎంత మాత్రం ఆపలేదనేది ఒక విషయం. మామూలు వర్షపాతం వస్తే ఆ రింగ్ బండ్‌లు నిలపగల నీరు ఆ రిజర్వాయర్ల ఆయకట్టులో 10వ వంతుకు కూడ సరిపోదనేది బహుశా అంతకంటే ముఖ్యమైన విషయం.

కడప జిల్లాలో సగిలేరును పొంగించిన వరద తూర్పున మన్నేరు వాగులోకి ప్రవహించింది. మన్నేరుకు రెండు ఉపవాగులు ఉన్నాయి. ఒకటి ఉప్పువాగు, ఒకటి పిల్లాపేరు. అక్టోబర్ 18-19 రాత్రి వీటికి పైన ఉన్న అయిదారు చెరువులు కూడా తెగి ఈ ఏర్లలో ప్రవాహం చాలా పెరిగింది. ఉప్పువాగుపైన ఉన్న వక్కలగండి ప్రాజెక్టు కట్టతెగగా, పిల్లాపేరు పైనున్న గండిపాలెం ప్రాజెక్టు అలుగు దాటి శరవేగంగా నీరు ప్రవహించింది. ఇవి రెండూ మన్నేరుపైన ఉన్న మోపాడు ప్రాజెక్టులోకి ప్రవహించాయి. అప్పటికి 15 రోజులుగా నిండి వున్న మోపాడు ప్రాజెక్టు ఈ నీటిని ఆపలేక పోయింది. మన్నేరు నీరే కాక అయిదారు చెరువుల నీరు కూడా కట్టలు తెంచుకొని మోపాడులోకి వచ్చింది. ఈ నీరంతా అలుగు మీదుగా పెద్ద ఎత్తున ప్రవహించింది. ఆఖరి నిముషంలో ఇళ్లు విడిచి పెట్టి వెళ్లి పోవాలని ప్రయత్నించిన మోపాడు క్రిష్టియన్ పాలెం వాళ్లు, కొత్తపల్లివాళ్లు వరదలో కొట్టుకు పోయారు. క్రిష్టియన్ పాలెంకు చెందిన దళితులు 117 మంది చనిపోయారు. మొత్తం 250 మంది చనిపోయారు.

మన్నేరు ప్రతాపం అక్కడితో ఆగిపోలేదు. పామూరు మండలంలోని మోపాడు నుండి కిందికి ప్రవహించి లింగసముద్రం మండలంలోని రాళ్లపాడు ప్రాజెక్టు ఆనకట్టను మూడు చోట్ల తెంపింది. 20 మీటర్ల ఎత్తున్న కట్టను బుల్‌డోజర్ కంటే బీభత్సంగా దున్ని వెళ్లిపోయింది. దిగువకు శరవేగంగా ప్రవహించి ఉలవపాడు దగ్గర జాతీయరహదారినీ, రైల్వేలైన్‌నూ ధ్వంసం చేసి వార్తలు సృష్టించింది.

ఇక్కడ కొంచెం ఆగి ఈ బీభత్స మంతా ఎందుకు జరిగిందని ఆలోచిద్దాం. చెరువులోకయినా, ప్రాజెక్టు రిజర్వాయర్‌లోకయినా, వరదనీరు ప్రవహిస్తే కట్ట ఎందుకు తెగాలి? చెరువు పరిమాణం వరకు నీరు చెరువులోనే నిలువ ఉండాలి. ఆపైన వచ్చిన అదనపు నీరు బయటికి పోవడానికి చెరువు నిర్మాణంలోనే ఒక ఏర్పాటు ఉంటుంది. దానిని అలుగు, మత్తడి, కలుజు మొదలయిన పేర్లతో పిలుస్తారు. ఆ అలుగు మీదుగా ప్రవహించే వరదనీరు చుట్టు పక్కల ఉన్న పొలాలకూ, ఇళ్లకూ, నష్టం కలిగించకుండ ప్రవహించడానికి ఒక ఓవర్ ఫ్లోచానెల్ ఉంటుంది. ఇది సాధారణంగా దిగువన ఇంకొక చెరువులోకి (లేకపోతే వాగులోకి) ప్రవహిస్తుంది. నిజానికి పూర్వ కాలంలో కట్టిన చెరువులన్నీ చాలా నేర్పుగా రూపొందించిన నీటిపారుదల వ్యవస్థలు. ఒకదానికొకటి 'లింక్' అయిన అయిదారు చెరువులు ఒక వ్యవస్థగా కలిసి వుంటాయి.

దీనిని ఎంత జాగ్రత్తగా కాపాడినా అతివేగంగా వరదవస్తే కట్టలు తెగవచ్చు, అలుగు దాటి ప్రవహించిన వరదనీరు ఊళ్లను ముంచవచ్చు. ఇదివరకు నూటికో కోటికో ఒకసారి ఇలా జరిగేది. కాని ఇప్పుడు చెరువుల నిర్వహణ పట్ల ప్రభుత్వం ఏ మాత్రం ఆసక్తి చూపించక పోవడం వల్ల ఏ కొంచెం అతివృష్టి వచ్చినా చాలా నష్టం జరుగుతున్నది. ప్రతీ సంవత్సరం చెరువులోకి కొత్తగా వచ్చి చేరే నీటితోపాటు మట్టి కూడా కొట్టుకొస్తుంది. ఇది చెరువు గర్భంలో పూడికగా పేరుకొని పోతుంది. దీనిని ఎప్పటికప్పుడు తీసేయకపోతే చెరువు 'కెపాసిటీ' తగ్గిపోతుంది. అంటే చెరువులో నిలవ ఉండగల నీటి పరిమాణం తగ్గి పోతుంది. అది తగ్గిపోయే కొద్దీ నీళ్లు నిలవక అలుగు పారడం, కట్టలకు గండి పడడం జరుగుతుంది. గత అక్టోబర్ 18-19ల రాత్రి గండిపడిన చెరువులలో రాళ్లపాడు రిజర్వాయర్‌కు 20 అడుగుల పూడిక ఉందనీ, పోరుమామిళ్ల చెరువులో పూడిక 15 అడుగుల దాకా ఉందనీ స్థానికులు చెప్తున్నారు. నిజానికి కొన్ని దశాబ్దాలుగా ఏ చెరువుకూ ఎక్కడా పూడిక తీయడమే లేదు.

చెరువు కట్టకు ఒకసారి గండి పడితే సరిగ్గా మరమ్మతు చేయక పోవడం వల్ల ఏ కొంచెం వరద వచ్చినా అక్కడే గండి పడుతుంది. రాళ్లపాడు రిజర్వాయర్‌కు 1994లో ఒకసారి గండి పడింది. దానికి రిపేర్ జరిపించా మనిపించారు. కానీ గత సంవత్సరం సరిగ్గా అక్కడే రిజర్వాయర్ కట్ట తెగింది. ఆ నీళ్లే ఉలవపాడు దగ్గర హైవేనీ రైల్వేలైన్‌నూ ధ్వంసం చేసింది. 'అది ప్రకృతి వైపరీత్యం' అనుకొని ఓపికగా హైవేపైన గంటలకొద్దీ నిలిచిపోయిన ప్రయాణికులకు ఈ సంగతి తెలిస్తే ప్రభుత్వంపైన ఎంతకోపం వచ్చేదో!

అలుగుపైన ప్రవహించే వరదనీరు దిగువకు పోవలసిన ఓవర్ ఫ్లో చానెల్ తరచుగా దురాక్రమణకు గురి అవుతుంది. ఇళ్లు, పొలాలు వెలుస్తాయి. తెలిసికూడా ఈ దురాక్రమణను అధికారులు అడ్డుకోరు. ఒక్కొక్కసారి పట్టాలు కూడా ఇస్తారు. దాని వల్ల వరదనీరు అడ్డదిడ్డంగా ప్రవహించి చాలా నష్టం చేస్తుంది.

నిజం చెప్పాలంటే చెరువుల నిర్వహణ అసమర్థంగా జరుగుతుం దనడం కూడా తప్పే. అసలు చెరువుల నిర్వహణ అనేదే లేదనడం సబబుగా ఉంటుంది. మన పాలకులు అసలే పట్టించుకోని విషయాలలో చెరువుల వ్యవస్థ ఒకటి అంటే అతిశయోక్తి కాదు. చిన్న చెరువుల నిర్వహణ ( ఆయకట్టు 100 ఎకరాల లోపు ఉన్నవి) పంచాయతిరాజ్ శాఖ బాధ్యత కాగా, పెద్దవాటి నిర్వహణ నీటిపారుదల శాఖ బాధ్యత. దీనికి ప్రభుత్వం 1 ఎకరం ఆయకట్టుకు 40 రూపాయలు (సంవత్సరానికి) ఇస్తుంది. చెరువుల నిర్వహణ కోసం నియమితులయిన వర్క్ చార్జ్‌డ్ సిబ్బంది జీతాలు దీనిలోనే పెట్టుకోవాలి. ఇతర ఖర్చులు ఉండనే ఉంటాయి. అందువల్ల పూడికలు తీయడానికి గానీ చెరువు కట్టల మరమ్మతుకుగానీ పైసలు వుండవు. కట్టలు తెగినప్పుడు ప్రభుత్వం ప్రత్యేక కేటాయింపుల రూపకంగా మరమ్మతుకు అయ్యే మొత్తం సమకూరుస్తుంది. దాని బదులు రొటీన్‌గా చెరువుల వ్యవస్థ సక్రమంగా నిర్వహించి కాపాడుకుంటే

ఆ అవసరమే తరచుగా రాదు. ఈ విధానరాహిత్యాన్ని అర్థం చేసుకుంటే తప్ప **1996** అక్టోబర్ నాటి వరదలను అర్థం చేసుకోలేం. మన రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలు సాగునీటి కోసం బావులపైన, చెరువులపైన ఆధారపడతాయి. బావుల బాగోగులు రైతు స్వంత బాధ్యత. పెట్టుబడి పెట్టుకోగలిగితే పెట్టుకొని వాటిని కాపాడుకోవాలి. చెరువులు ప్రభుత్వం బాధ్యతే కానీ వాటి నిర్వహణ శూన్యం. ఇక ప్రాజెక్టు కాలవల మాటకొస్తే కట్టేంత వరకే ఆసక్తి తప్ప ఆ తరువాత రిజర్వాయర్‌లోనూ, కాలవలలోనూ పూడికలు తీయడం, ఇతర మరమ్మతులు చేయడం రొటీన్‌గా జరగడం లేదు. బాగా పూడిపోయిన తరువాత ఏ ప్రపంచ బ్యాంకు దగ్గరో అప్పుతెచ్చి ఒక్కసారి రిపేరు చేస్తే (ఈ మధ్య కోనసీమలో చేసినట్టు) ఆ రైతులు అదృష్ట వంతులనుకోవాలి. మరి నీటి పారుదల వ్యవస్థ నిర్వహణ గురించి ప్రభుత్వం ఏం చేస్తున్నట్టు?

తెలుగుగంగ కాలవ గట్లు తెగడం కూడ గత అక్టోబర్‌లో జరిగిన విధ్వంసానికి ఒక కారణం. ఈ విషయంలో మామూలు నిర్లక్ష్యానికి రాజకీయం కూడ తోడయింది. మద్రాసుకు మంచినీరందించిన ఘనత త్వరగా దక్కాలని తవ్వీ తవ్వని కాలవల గుండా గత సెప్టెంబర్‌లో మద్రాసుకు నీటి సరఫరా ప్రారంభించారు. అక్టోబర్ నెలలో వరదలు వచ్చాయి. ప్రభుత్వం తొందరపాటు బయట పడింది. దానికి మూల్యం చెల్లించింది తొందరపాటుకు బాధ్యులయిన రాజకీయ నాయకులు కాదు. నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాల రైతులు.

శ్రీశైలం రిజర్వాయర్ నుండి బయలు దేరే తెలుగు గంగ కాలవ కడప జిల్లాలో పెన్న నదిలో కలిసి సోమశిల చేరుకుంటుంది. సోమశిల రిజర్వాయర్ నుండి నెల్లూరు జిల్లాలోనే వున్న కండలేరు రిజర్వాయర్‌లోకి పోతుంది. అక్కడి నుండి మద్రాసుకు పోతుంది. దీనికి సంబంధించిన కాలవల నిర్మాణం, కాలవలపైన అవసరమైన బ్రిడ్జిల నిర్మాణం పూర్తిగా చేపట్టవలసి వుండింది. సోమశిల రిజర్వాయర్‌లో తెలుగుగంగ నీళ్లు కూడ (తాత్కాలికంగానయినా సరే) నిలువ ఉండాలి కాబట్టి సోమశిల కింద ముంపు పెరుగుతుంది. దీనికి సంబంధించిన భూసేకరణ చేయవలసి వుండింది. ఇదేదీ చేయకుండ గత సెప్టెంబర్ నెలలో తెలుగుగంగ ద్వారా మద్రాసుకు నీళ్లు పంపించడం మొదలు పెట్టారు. అక్టోబర్‌లో కుంభవృష్టి కురిసేసరికి లోపాలన్నీ బయటపడ్డాయి. దానికి రైతులు కూలిన ఇళ్లతోనూ, మునిగిన చేలతోనూ, ఇసుక మేటవేసిన పొలాలతోనూ మూల్యం చెల్లించారు.



అక్టోబర్ **18-19** రాత్రి సగిలేరులో వచ్చిన వరదగురించి పైన చెప్పాము. సగిలేరు పెన్నకు ఉపనది. ఈ వరద పోయి పెన్నలో కలిసింది. అసలే తెలుగుగంగ కోసం ఎక్కువ నీళ్లు నింపుకున్న సోమశిల రిజర్వాయర్‌లో మరింత నీళ్లు చేరాయి. సోమశిల ముంపు పెరిగి అప్పటికింకా ముంపు గ్రామాలుగా గుర్తించనివి కూడ మునిగాయి. సోమశిల రిజర్వాయర్ పూర్తిస్థాయి **330** అడుగులు. అక్కడిదాకా నీళ్లు నిలిస్తే ముంపు ఎంత వుంటుందో అంతమేరకు భూసేకరణ చేయవలసి వుండింది. కానీ **315** అడుగులవరకే చేసారు. అందులోనూ అందరికీ నష్టపరిహారం ఇవ్వలేదు. **290** అడుగుల వరకు మునిగే గ్రామాలు మాత్రమే ఖాళీ అయ్యాయి. మిగిలిన వాళ్లను ఖాళీ చేయించలేదు. అంతలో తెలుగుగంగను తీసుకొచ్చి పెన్నలో కలిపారు. ఆపైన సగిలేరు వరద వచ్చింది. దీనితో అకస్మాత్తుగా ముంపు పెరిగి కడప జిల్లా అట్లూరు మండలంలో చాలా భూమి మునిగింది.

ఇదికాక, తెలుగుగంగ కాలవ నిర్మాణం సరిగ్గా జరగకపోవడం వల్ల కండలేరు రిజర్వాయర్‌కు దిగువ (నెల్లూరు, చిత్తూరు జిల్లాలలో) **7** చోట్ల కాలవగట్టుకు గండిపడింది. రెండుచోట్ల అధికారులు, రైతులు నష్టాన్ని నివారించడానికి తామే తెగగొట్టారు. మిగిలిన చోట్ల అదే తెగింది. ఉదాహరణకు నెల్లూరు జిల్లా వెంకటగిరి మండలంలో జంగాలపల్లి అనే గ్రామం వుంది. ఈ గ్రామం దగ్గర తెలుగుగంగ కాలవకు బ్రిడ్జి కట్టవలసి వుండింది. కానీ తొందరగా మద్రాసుకు నీళ్లు వదలాలన్న ఆరాటంలో బ్రిడ్జి నిర్మాణం సరిగ్గా జరిగే దాకా ఆగకుండ కాలవ ప్రవాహం కోసం సిమెంటు తూములు అమర్చి వాటిమీద మట్టిపోసి తాత్కాలికమైన బ్రిడ్జి తయారుచేసి మద్రాసుకు నీళ్లు వదిలారు. అయితే అక్టోబర్ **18-19**ల రాత్రి ఒక్కసారిగా కాలవలో ప్రవాహం పెరిగేసరికి ఆ తూములు సరిపోలేదు. నీళ్లు వెల్లువగా పైకి వచ్చేసాయి. జంగాలపల్లి మునిగిపోబోయింది. రైతులు నీటిపారుదల శాఖ ఇంజనీరును పిలిపించి ఆయన సలహా మేరకు బ్రిడ్జికి పక్కన కాలవకట్ట తెంపి ఊరిని కాపాడారు. అయినప్పటికీ ప్రధానంగా నేత పనివారి గ్రామమయిన జంగాలపల్లి బాగా నష్టపోయింది. ఊరిలో నీరు నిలవడం వల్ల మగ్గాలపైన పనిచేయడం అసాధ్యమయింది. నిజానికి వరద రాకపోయినా పక్కనున్న కాలవ వల్ల జంగాలపల్లిలో తరచుగా మగ్గం గుంటలలోకి నీళ్లు వస్తుంటాయనీ, దానిని కండలేరు ముంపు గ్రామంగా గుర్తించి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలనీ గ్రామస్తులు కోరగా అట్లాగే స్వాధీనం చేసుకుంటామని అధికారులు చాలాసార్లు ప్రకటించారు. కానీ అదేమీ జరగక ముందే వరద వచ్చింది.

తెలుగుగంగ కాలవకు తక్కిన గండ్లన్నీ చిత్తూరు జిల్లాలో పడ్డాయి. తొట్టంబేడు మండలం రాంభట్ల పల్లి గ్రామం దగ్గర ఒక చెరువు వుంది. ఆ చెరువు అలుగు మీదుగా వరద నీరు పోవలసిన ఓవర్‌ఫ్లో ఛానెల్ మార్గానికి అడ్డంగా తెలుగుగంగ కాలవ తవ్వారు. అందువల్ల ఈ వరద నీటి మార్గం కోసం కాలవపైన బ్రిడ్జి కట్టారు. దాని ఎలైన్‌మెంట్ సరిగ్గా లేదని రైతుల ఫిర్యాదు. ఏమయితేనేం అక్టోబర్ **18-19** రాత్రి రాంభట్లపల్లికి ఎగువన వున్న **14** చెరువుల నుండి వరద వచ్చి రాంభట్లపల్లి చెరువు అలుగు మీదుగా

ప్రవహించింది. తెలుగు గంగ కాలవ దాటడానికి దానికోసం ఏర్పాటు చేసిన బ్రిడ్జి సరిపోక ఆ వరద కాలవలో పడి కాలగట్టుకు మూడు గండ్లు వేసింది. పక్కనే వున్న కొన్నలి అనే గ్రామం దగ్గర కూడ తెలుగుగంగ కాలవకు గండిపడింది. **1993**లో (అంటే కాలవ వాడకం ప్రారంభం కాకముందే) అదే చోట గండిపడిందనీ, దానిని రిపేరు చేసినప్పుడు ఒక్కొక్క లెవెల్‌లో రోలర్ వాడకుండ ఒకేసారి మట్టిపోసి రోలర్‌తో తొక్కారనీ అందువల్ల మళ్లీ వరద వచ్చినప్పుడు అదే చోట కట్ట తెగిందనీ కొన్నలి రైతులు అంటున్నారు. రాంభట్లపల్లి సమీపంలోని కాలవలో కూడ **1993**లో చెరువుల వరద నీటివల్ల ఇసుక మేట వేసిందనీ, కాలవ గర్భంలో పేరుకొని పోయిన ఈ ఇసుకను తొలగించక పోవడం వల్ల రాంభట్లపల్లి దగ్గర తెలుగుగంగ కాలవ నీళ్లు ఒక్కొక్కసారి వెనక్కి ప్రవహిస్తాయనీ, అక్టోబర్ **18-19** రాత్రి అది జరగడం వల్లనే ఎగువన వున్న (నెల్లూరు జిల్లా) జంగాలపల్లి దగ్గర ముంపు వచ్చిందనీ స్థానికులు అంటారు. ఇది నిజమేనని నెల్లూరులోని తెలుగుగంగ ఆఫీసులో కూర్చున్న ఒక ఇంజనీరు నిజాయితీగా ఒప్పేసుకుంటాడు. కానీ వాళ్ల నిర్లక్ష్యానికీ, చేతకాని తనానికీ రాంభట్లపల్లి రైతులూ జంగాలపల్లి నేత పనివారూ మూల్యం చెల్లించవలసి వచ్చింది.

చిత్తూరు జిల్లా మదనపల్లి పట్టణంలో గత సంవత్సరం జూన్ నెలలో జరిగిన వరద బీభత్సంలో కూడ ప్రకృతి వైపరీత్యం ఎంత ఉందో మన పాలకుల నిర్వాకం అంత వుంది. మదనపల్లికి ఎగువన కర్నాటక సరిహద్దు దగ్గర భారీగా వర్షాలు కురిసాయి. దాని ఫలితంగా మొత్తం **9** చెరువుల నీళ్లు (కొన్ని అలుగులు పొంగి, కొన్నిటి కట్ట తెగి) మదనపల్లి మీదికి వరదగా వచ్చాయి. బాహుదానది మదనపల్లి గుండా ప్రవహిస్తుంది, దానిలో కలిసే రెండు వాగులు (బుగ్గ కాలవ, ముగ్గురాళ్ల వంక) కూడ మదనపల్లి గుండా ప్రవహిస్తాయి. ముగ్గురాళ్ల వంక మదనపల్లి పట్టణం మధ్యనే బాహుదానదిలో కలుస్తుంది. పొంగిన **9** చెరువుల నీళ్లు ఈ వాగుల లోనికీ, నదిలోనికీ ప్రవహించి జూన్ **14** సాయంత్రం మదనపల్లి జల మయం అయింది. ఈ వాగులు వుండవలసినంత వెడల్పుగా వుంటే వరదనీటిలో చాలాభాగం ప్రవాహమై వెళ్లిపోయేదే. మదనపల్లికి ప్రాణ గండం తప్పేదే. కానీ దురాక్రమణల వల్ల ఈ వాగులు పిల్ల కాలవ లయిపోవడం వల్ల నీరంతా ఊరిపాలయింది. **27** ప్రాణాలు పోయాయి.

బాహుదానది **300** అడుగుల వెడల్పు వుండవలసింది కొన్నిచోట్ల **50** అడుగులే మిగిలింది. ముగ్గురాళ్ల వంక మేదరి బజారులో **120** అడుగుల వెడల్పు వుండవలసింది ఇప్పుడు కొన్నిచోట్ల **10** లేక **15** అడుగులు మాత్రమే వుంది. ఇక్కడే వరద ఎక్కువ వచ్చి **27** ప్రాణాలు పోయాయి. ఈ వంకను ఒకపక్క మేదరివాళ్లు ఆక్రమించుకొని ఇళ్లు వేసుకుంటే ఇంకొక పక్క మునిసిపాలిటీయే ఆక్రమించుకొని షాపులు కట్టి అద్దెకు ఇచ్చింది. మేదరి వాళ్లు **40** ఏళ్లుగా వుంటున్నారు. వారి ఆక్రమణకు మునిసిపాలిటీ 'నో అబ్జెక్షన్' సర్టిఫికెట్ ఇచ్చింది. బుగ్గ కాలవను కూడ ఇదే విధంగా మధ్య తరగతి – కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ కులస్తులు – ఆక్రమించుకొని ఇళ్లు కట్టుకున్నారు. వరద వచ్చి జనం చచ్చిపోయిన తరువాత కూడా వీళ్ల ఆక్రమణను తొలగించే ప్రయత్నమేమీ మునిసిపాలిటీ చేయడం లేదు. తాను ముగ్గురాళ్ల వంకను ఆక్రమించుకొని కట్టిన షాపింగ్ కాంప్లెక్స్‌ను కూడా మునిసిపాలిటీ తొలగించబోవడం లేదు. కానీ మేదరివాళ్లను మాత్రం బుట్టలు సర్దుకొని ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపొమ్మంటున్నారు. అప్పుడే మేదరి వీధికి కరెంటు కూడా తీసేసారు.

'ప్రకృతి బీభత్సం'లో పాలకుల బీభత్సం చాలా వుందని ఈపాటికి అర్థం అయ్యే వుండాలి. ఈ బీభత్సం వల్ల పైన పేర్కొన్న జిల్లాలలో వేలాది ఎకరాలలో పంట నాశనం అయింది. వేల సంఖ్యలో ఇళ్లు కూలాయి. వందల ఎకరాల పొలంలో ఇసుక మేట వేసింది. దీనికి ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారం అతి స్వల్పం. పూర్తిగా కూలిపోయిన ఇంటికి **1000** రూపాయలు, దెబ్బతిన్న ఇంటికి **500** రూపాయలు ఇచ్చారు. పంట నాశనమైన భూమికి ఎకరానికి **250** రూపాయల దాకా ఇచ్చారు. దీనిని రైతులు భిక్షగా భావిస్తే వాళ్లను తప్పు పట్టనవసరం లేదు. అన్నిటికంటె పెద్ద నష్టం భూములలో ఇసుక మేట వేయడం వల్ల జరిగింది. ఇసుక మేటను తొలగించి ఆ భూమిని సాగు యోగ్యం చేసుకోవడానికి ఒక ఎకరానికి **10** వేల నుండి **20** వేలు ఖర్చవుతుందని అంచనా. దీనికి ప్రభుత్వం చేస్తున్న సహాయం శూన్యం. తెలుగుగంగ కట్టకు గండి పడడం వల్ల ఇసుక మేట వేసిన భూములకు మాత్రమే తెలుగుగంగ ప్రాజెక్టు ఖాతా నుండి కొంత మొత్తం ఇచ్చారు. మిగిలిన వాటికి ఏమీ ఇవ్వలేదు. వాటిని రైతులు బాగు చేసుకోలేకపోతే అవి బంజర్లుగా మిగిలిపోతాయి. ఇదంతా ఒకెత్తయితే గండిపడిన వందలాది చెరువులకు ఇప్పటికీ శాశ్వత మరమ్మతులు చేపట్టకపోవడం ఒకెత్తు. కొన్ని చెరువులు తెగిన కట్టలతో పురాతన శిథిలాలలాగ అట్లాగే వున్నాయి. మరమ్మతులు చేపట్టిన వాటికి తాత్కాలికమైన రింగ్‌బండ్‌లు మాత్రమే వేసారు. వీటి ఎత్తు చాలా తక్కువ. అవి నిలపగల నీరు తక్కువ. మామూలు ఆయకట్టులో కొద్ది భాగానికి మాత్రమే అది సరిపోతుంది. అతివృష్టి మరొకసారి వచ్చిందంటే ఈ రింగ్‌బండ్‌లను దాటి నీరు మళ్లీ ఊళ్లలోనికీ, పొలాల లోనికీ వరద అయి ప్రవహిస్తుంది. రాబోయే రెండు సంవత్సరాల దాకా ఇదేపరిస్థితి అని నీటిపారుదల శాఖ ఇంజనీర్లే అంటుంటే ఇంక రైతులు ఎవరికి మొరపెట్టుకోవాలి?

అన్నట్టు చంద్రబాబు కంప్యూటర్లో చెరువుల సమాచారం వుందా? ఎన్ని చెరువులు, ఎంత ఆయకట్టు, ఎన్నిచోట్ల కట్టలు తెగాయి, ఎన్ని ఎకరాల పంట కొట్టుకుపోయింది, ఎన్ని ఇళ్లు ధ్వంసం అయ్యాయి, ఎన్ని ఎకరాలు ఇసుక మేటవేసాయి, ఎందరు చనిపోయారు, తలసరి ఎన్ని రూపాయల నష్టపరిహారం తమ ప్రభుత్వం ఇచ్చింది? ఈ సమాచారం వుందా? లేకపోతే ఎక్కించుకుంటే బాగుంటుంది. ఎక్కించుకొని వారానికొక్కసారయినా చూసుకుంటే తన బాధ్యత జ్ఞాపకం వుంటుందేమో. ●

'ప్రకృతి బీభత్సం'లో పాలకుల బీభత్సం చాలా వుంది. ఈ బీభత్సం వల్ల వేలాది ఎకరాలలో పంట నాశనం అయింది. వేల సంఖ్యలో ఇళ్లు కూలాయి. వందల ఎకరాల పొలంలో ఇసుక మేట వేసింది. దీనికి ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారం అతి స్వల్పం. పూర్తిగా కూలిపోయిన ఇంటికి 1000 రూపాయలు, దెబ్బతిన్న ఇంటికి 500 రూపాయలు, పంట నాశనమైన భూమికి ఎకరానికి 250 రూపాయల దాకా ఇచ్చారు. దీనిని రైతులు భిక్షగా భావిస్తే వాళ్లను తప్పు పట్టనవసరం లేదు.